క్లుప్తంగా

నేలవాలిన వరి



జామచెట్లబావిలో నేలవాలిన వరి చేను

మోత్కూరు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి వరి పైర్లు నేల వాలాయి. కోతకు వచ్చిన దశలో ఉన్న వరి పంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జామచెట్లబావి గ్రామానికి చెందిన బీసు నర్సయ్యకు చెందిన రెండు ఎకరాల వరి చేను పూర్తిగా నేలకొరిగింది. పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి చేలు సైతం దెబ్బతిన్నాయి.

42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలి

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించి రిజర్వేషన్‌లను సాధించాలన్నారు. జనాభాలో 4 శాతం ఉన్న ఓసీలకు 10శాతం రిజర్వేషన్లు ఇస్తుంటే 57 శాతానికి పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడం కరెక్టే అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు పార్టీలకు అతీతంగా బీసీలంతా ఏకమై పోరాడాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు కూడా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

18న గీత కార్మిక సంఘం మండల మహాసభ



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గీత కార్మిక సంఘం నాయకులు

వలిగొండ : ఈ నెల 18న తేదీన కల్లుగీత కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించనున్నట్లు కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మద్దెల రాజయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. మహాసభకు ప్రతి గ్రామం నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాజుల ఆంజనేయులు, పబ్బతి మల్లేశం, పలుసం స్వామి, కొండూరు సత్తయ్య పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

ఆలేరు: ఆలేరు పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరికృష్ణ మంగళవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు https:// iti. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 17 వరకు గడువు ఉందని తెలిపారు. సీఓపీఏ, స్మార్ట్‌సిటీ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 98668 43920 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



పుల్లమ్మ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

గుండాల : సుద్దాల గ్రామానికి చెందిన నిరుపేద ఎర్ర పుల్లమ్మ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆమె కుటుంబానికి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం రూ.11,500 అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు గడ్డమీది పాండరి, బత్తిని రవి, నాయకులు మొగులాల్, అయిలయ్య, నగేష్, కుమారస్వామి, మహోదయ్, మోహన్‌రెడ్డి, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

పద్మబ్రాహ్మణ పురోహిత సంఘ భవనం నిర్మించాలి

రాజాపేట : జిల్లా కేంద్రంలో పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం భవనాన్ని ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండు రంగశాస్త్రి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని రేణికుంట గ్రామంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాటి నరేందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అయిటిపాముల భీమయ్య, కోశాధికారి గుర్రం కృష్ణ, నాయకులు చిట్యాల వెంకటేశం, చలమల్ల ధనుంజయ, అప్పం పృథ్వీరాజ్, పసునూరి నిత్యానందం, మహేశ్వరం ప్రసాద్, సంతోష్‌కుమార్, హేమంత్‌కుమార్, పురుషోత్తం, శ్రీహరి, వాసుదేవ్, చంద్రమౌళి, పాండురంగం, కిశోర్, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

పడావుగా ప్రభుత్వ భవనాలు

- నిరుపయోగంగా జూనియర్ కళాశాల, బీసీ హాస్టల్ బిల్డింగ్
- అధికారులు పట్టించుకోక అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా
- ఇతర కార్యాలయాలకు వినియోగించాలని స్థానికుల డిమాండ్



నిరుపయోగంగా ఉన్న జూనియర్ కళాశాల భవనం

బొమ్మలరామారం : మండల కేంద్రం బొమ్మలరామారంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీసీ హాస్టల్, పాత తహసీల్దార్ కార్యాలయాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా శాఖల అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇతర కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నా.. ఉన్న ప్రభుత్వ భవనాలను పడావు పెట్టడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భవనాల్లో చెత్తకుప్పలు

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం సరిపోవడం లేదని ఐదేండ్ల క్రితం కొత్త భవనాన్ని నిర్మించారు. పాత భవనాన్ని వినియోగించడం లేదు. ఎన్నో ఏండ్లుగా మండల ప్రజలకు సేవలు అందించిన తహసీల్దార్ కార్యాలయం కొత్త భవనంలోకి మార్చడంతో పాత భవనం వృథాగా మారింది. దాంతో పాటు బీసీ హాస్టల్‌కు విద్యార్థులు రావడం లేదని దానిని క్లోజ్ చేశారు. మండల కేంద్రంలో నడి బొడ్డున ఉన్న ఈ భవనాలను సంవత్సరాలుగా వినియోగించక పోవడంతో ప్రస్తుతం చెత్త కుప్పలు, ఏపుగా పెరిగిన కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. బీసీ హాస్టల్ భవనం గురించి పట్టించుకునే వారు లేక అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

ఇతర వాటికి వినియోగించాలి

మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ ఇరుకుగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే సిబ్బంది, పెంపకం దారులు ఇబ్బందులు పడున్న పరిస్థితి. దాంతో పాటు మండల ప్రజలకు టౌన్‌హాల్, కమ్యూనిటీ హాల్ లాంటి వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని బస్టాండ్‌గా, లేదా షాపింగ్ కాంప్లెక్స్‌గా మారిస్తే ప్రజలకు ఉపయోగ పడడంతో పాటు గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. లేదా దానిని పశువైద్యశాలగా మార్చినా పెంపకం దారులకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

టౌన్‌హాల్ ఏర్పాటుతో ప్రయోజనం

పాత తహసీల్దార్ కార్యాలయాన్ని టౌన్‌హాల్‌గా మార్చి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. మండల ప్రజలు, అధికారులు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ భవనం వీలుగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా రోజులుగా ఉంది. కానీ సరైన భవనం లేదనే సాకుతో మంజూరు చేయలేదు. డిగ్రీ కళాశాల అందుబాటులో లేక చాలా మంది పేద విద్యార్థులు తమ చదువును ఇంటర్‌తోనే ఆపేస్తున్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

వినియోగంలోకి తేవాలి



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తేవాలి. వాటిని ప్రజల అవసరాల మేరకు మార్పు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉన్న భవనాల్లో పశువుల ఆస్పత్రి, టౌన్‌హాల్ ఏర్పాటు చేయాలి.

–కట్టా శ్రీకాంత్ గౌడ్, బొమ్మలరామారం

భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి డిగ్రీ కళాశాల, బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్ వంటివి ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలి.

–జూపల్లి భరత్, బొమ్మలరామారం

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

భువనగిరి : వానకాలం ధాన్యం కొనుగోలు చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో భువనగిరి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఏఓలు, ఏపీఎంలు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడం ప్రారంభించాలన్నారు. కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.మిల్లర్లు ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసుకునేలా తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు ఎదురు కాకుండా కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఎదుల్లగూడెం సమీపంలోని రైల్వే అండర్ పాస్ వద్ద నిల్వ ఉన్న నీటిని తోడిస్తున్న ఎంపీడీఓ

వలిగొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ జలంధర్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని నాగారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి ఎదుల్లగూడెం సమీపంలో రైల్వే అండర్‌పాస్ వద్ద నిలిచిన నీటిని ఆయన పరిశీలించారు. రైల్వే అధికారులతో సంప్రదించి మోటారు సాయంతో వాటిని తోడి వేయించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కర్

యాదగిరిగుట్ట రూరల్: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ అన్నారు. సీసీ కెమెరాల ప్రయోజనాలు, సైబర్ నేరాల నియంత్రణపై మండలంలోని మల్లాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే తెలియని లింక్‌లు ఓపెన్ చేయొద్దని, ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దని అన్నారు. ఎవరైనా డ్రగ్స్‌ను వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరుతో మోసం

ఆలేరు రూరల్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ వారిని మోసగించడానికే అని బీజేపీ మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి విమర్శించారు. ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి రిజర్వేషన్ల పెంపు వంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేయాలంటే 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కామిటికారి కృష్ణ, బోగ శ్రీనివాస్, బైరి మహేందర్‌గౌడ్, రాజు, సురేష్, నర్సింహులు, మిట్టపల్లి భాస్కర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి



కొమ్మాయిగూడెం రైల్వే అండర్ పాస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : మండలంలోని కొమ్మాయిగూడెం, సిరిపురం రైల్వే అండర్ పాస్‌లలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం కొమ్మాయిగూడెం రైల్వే అండర్ పాస్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. సరైన ప్రణాళిక ప్రకారం అండర్ పాస్ నిర్మించకపోవడంతో నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శానగొండ వెంకటేశ్వర్లు, అంతటి సత్తయ్య, శానగొండ రాము, గుణగంటి మల్లేశం, ఆవనగంటి శేఖర్, ఆకిటి మల్లేశం, శ్రీను, జెల్లెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, ఎంఈఓ

చౌటుప్పల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి, ఎంఈఓ గురువారావు అన్నారు. దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మండలంలోని 60 పాఠశాలలకు చెందిన 7,630 మంది విద్యార్థులకు రూ.70.18 లక్షల విలువైన నోట్‌పుస్తకాలు, స్కూల్ బ్యాగులను అందజేయగా మంగళవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివీస్ లైజన్ ఆఫీసర్ బీకేకే చౌదరి, ప్రతినిధులు గోపి, సాయికృష్ణ, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్ ఎంట్రీ చేశాకే మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



వలిగొండ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ : రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేసిన తర్వాతే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో తడిసిన ధాన్యాన్ని, వెల్వర్తిలో రైతులు నిల్వ చేసిన ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందొద్దన్నారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిల్వచేసిన ధాన్యాన్ని రిజిస్టర్‌లో సీరియల్ నంబర్ ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు టెంట్, మంచినీటి వసతి కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, తహసీల్దార్ దశరథ, మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి, మండల సివిల్ సప్లయ్ అధికారి బాలమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఆత్మకూరు(ఎం): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీపీఆర్ విధానంపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసి మెరుగైన వైద్యం అందే వరకు కాపాడొచ్చని తెలిపారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.లావణ్య, ఎంపీడీఓ జె.రాములు నాయక్, డీటీ ఎండీ.షఫీయోద్దీన్, డాక్టర్ వంశీకృష్ణ, సూపరింటెండెంట్ ఎ.లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డగూడూరులో..

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వైద్యాధికారిణి భార్గవి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ జిల్లా ప్రోగ్రాం ట్రైనింగ్ ఆఫీసర్, మోత్కూర్ మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్ మండల స్థాయి అధికారులకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ ప్రేమలత, మండలంలోని వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం): సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమంత్‌కుమార్

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



గుండాల పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

గుండాల : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వాటర్ సంపు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. మాసాన్‌పల్లి గ్రామ ఉప కేంద్రంలో ఏఎన్‌ఎం పోస్టు ఖాళీగా ఉండటంతో డీఎంహెచ్‌ఓతో మాట్లాడి నియమిస్తామని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యాబోధన, భోజన వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఏఈకి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ చండీరాణి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఓ విజయలక్ష్మి, ఎంపీఓ సలీమ్, హౌసింగ్ ఏఈ కావ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి మునావర్ తదితరులున్నారు.

డయల్ 112పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏహెచ్‌టీయూ సిబ్బంది

ఆలేరు: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశానుసారం యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో కొత్తగా అమల్లోకి వచ్చిన డయల్ 112పై ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలపై సమాచార, మహిళలు, పిల్లల భద్రత తదితర అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం వేర్వేరు నంబర్లకు కాకుండా ఇక నుంచి 112 నంబర్‌కు డయల్ చేయాలని ఏహెచ్‌టీయూ సిబ్బంది సూచించారు. ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే వేగంగా స్పందిస్తారని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దాసరి మంజుల, ఆలేరు ఎస్‌ఐ వినయ్, రాచకొండ ఏహెచ్‌టీయూ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.ఖలీల్ అహ్మద్, ఏఎస్‌ఐ మీనాకుమారి, కానిస్టేబుల్ భానుప్రసాద్, ఎస్‌పీఓ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజాపేట నుంచి ఆలేరుకు ఆర్టీసీ బస్సు



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

రాజాపేట : మండల కేంద్రం రాజాపేట నుంచి ఆలేరుకు నూతన బస్సు సర్వీస్‌ను యాదగిరిగుట్ట డిపో అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నెమిల మహేందర్ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. మండల ప్రజల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు చేయాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కోరగా యాదగిరిగుట్ట డిపో అధికారులతో సంప్రదించి బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బస్సు ఉదయం 7.15 నిమిషాలకు రాజాపేట నుంచి బయలుదేరి పారుపల్లి, బొందుగుల, సోమారం, లక్ష్మక్కపల్లి, కొలనుపాక మీదుగా ఆలేరుకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. తిరిగి ఆలేరు నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి రాజాపేటకు చేరుకుంటుందని వెల్లడించారు. అనంతరం ఉదయం 11 గంటలకు బయలుదేరి ఇవే గ్రామాల మీదుగా ఉప్పల్ క్రాస్‌రోడ్ వరకు వెళ్లి తిరిగి రాజాపేటకు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళావిభాగం అధ్యక్షురాలు రేణుక, నాయకులు కేదారి, నవీన్, సురేందర్, గొలనుకొండ భిక్షపతి, గుర్రం శ్రవణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



పల్లివాడలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల అధికారి రోజారాణి

రామన్నపేట : ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రోజారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని పల్లివాడ, మునిపంపుల గ్రామాల్లో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని తూకం వేసే వరకు ఆరబెట్టాలని సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని హరిహరపుత్ర రైస్‌మిల్లును సందర్శించారు. ఆమె వెంట తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, పీఏసీఎస్ చైర్మెన్ నంద్యాల భిక్షంరెడ్డి, డీటీసీఎస్ బాలమణి, ఆర్‌ఐ రాజేశ్, వ్యవసాయ శాఖ అధికారి ఎజాజ్‌అలీఖాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చౌటుప్పల్ : ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని బీజేపీ మండల నాయకుడు తంగెళ్ల వెంకటేశ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామంలో నీట మునిగిన వరి పొలాలను మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెట్టు అంజయ్య, పరకాల జగదీష్, యాట సత్తయ్య, పగిళ్ల అంజిరెడ్డి, కాటం యాదయ్య, గోరయ్య, గంగదేవి నర్సింహ, కాటం స్వామి, మంద చంద్రశేఖర్, కొండ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

తుర్కపల్లి: బద్దు తండాలో మంగళవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి గుగులోత్ వెంకటేశ్, జూకంటి సురేశ్, కోడూరి బాలరాజును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,470 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తకియొద్దిన్ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుండాల : మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, జర్దా, పాన్‌తో ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశం, సిబ్బంది కరుణ, రవి, హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

బొమ్మలరామారం : రజకులు అన్ని రంగాల్లో వెనుకంజలో ఉన్నారని, వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలని మండల రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని తూంకుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన మండల రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ముదిగొండ శ్రీనివాస్, ఎడిజర్ల భూపాల్, జూపల్లి భరత్, బాలకృష్ణ, మహేష్, అనిల్, జంగయ్య, గణేష్, లింగయ్య, పాపులు, భూములు, నగేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

అడ్డగూడూరు : పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని రామాలయం వీధిలో ఒకరిని, చిత్తల్లబస్తీకి చెందిన తీపిరెడ్డి సోమిరెడ్డిని, దాసరి అంజయ్యను గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. పిచ్చికుక్క దాడితో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

రామన్నపేట : బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని లీగల్ ఎయిడ్ ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్‌రెడ్డి, జనంపల్లి బాలికల గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, బాలికల చట్టాలపై జనంపల్లి గురుకుల పాఠశాలలో మంగళవారం లీగల్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించారు. లీగల్ సెల్ సభ్యులు గణేష్, శ్రీశైలం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన పనులు వేగవంతం చేయాలి

బీబీనగర్ : మండల కేంద్రంలో నిర్మించిన పీహెచ్‌సీ భవన పనులను వేగవంతం చేయాలని జడ్పీసీఈఓ శోభారాణి ఆదేశించారు. మంగళవారం భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక ఉన్నారు.

జమ్మికుంటను పరిశీలించిన ఆర్డీఓ

ఆత్మకూరు(ఎం): మండల పరిధి పారుపల్లి గ్రామంలోని జమ్మికుంటను భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. జమ్మికుంటను ఆక్రమించి కొందరు రైతులు పొలంగా మారుస్తున్నారని అదే గ్రామానికి చెందిన కొసన రాములు, ఆంజనేయులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీఓ కృష్ణారెడ్డి జమ్మికుంటను పరిశీలించి విచారణ చేపట్టారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వి.లావణ్య, ఆర్‌ఐ ఉన్నారు.

రేషన్ దుకాణంలో చోరీ

బీబీనగర్ : మండలంలోని యర్రబెల్లితండాలో ఉన్న రేషన్ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి రేషన్ దుకాణంలో ఉన్న 6 క్వింటాళ్ల బియ్యాన్ని ఎత్తుకెళ్లారు. డీలర్ సంజీవరావు శనివారం సాయంత్రం దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం సెలవు కాగా సోమవారం దుకాణం వద్దకు వెళ్లగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీలర్ తెలిపారు.